కథానిక

# జారిపోయిన జేబురుమాలు

దండమూడి మహీధరకుమార్

మధు ట్రిప్లికేన్ టెర్మినస్ దగ్గర బస్ దిగినప్పుడు- ప్రెసిడెన్సీ కాలేజీ, క్లాక్ టవర్‌లో టైం ఆరుదాటింది. జనం బీచ్‌కి వెళ్తున్నారు. ఆ దృశ్యం అతనికి బాధాకరంగా వుందల్లేవుంది. చేతులు చేతులు పుచ్చుకొని హాసపరిహాసాలతో ఎంతో ఆనందంగా వున్న భార్యాభర్తలవేపు చూచి మొహం చిట్లించుకున్నాడు. తనకు లేనివస్తువు ఇతరులకుంటే అంత ఈర్ష్యపడాలి కాబోలు! అడుగులో అడుగేసుకుంటూ, ఆలోచనల భారాల్ని మోస్తూ, బీచ్‌వేపుకే నడిచాడు తను కూడా! తనముందు నడచినవాళ్ళు చాలా మటుకు స్విమ్మింగ్ పూల్ వేపుకు వెళ్తున్నారు. తనూ అటే నడిచాడు. వాళ్ళు వెళ్ళేది కాంటీన్‌కని మధుకు తెలియదేమో? తెలిసివుంటే ఎలా వెళ్తాడు అతని జేబులో నాలుగణాలుమాత్రం మిగిలివున్నాయి. మళ్ళా టి. నగర్ వెళ్ళటానికి మూడణాలు వెచ్చపెట్టాల్సివుందే! అణామిగిలితే కాంటీన్‌లో ఏం తిందామనుకుంటాడు? పిచ్చి మధు! తలకాయ వంచుకొని, గొర్రెలాగా, ముందునడిచే మనుషుల్ని అనుగమించాడు, వాళ్లకూ తనకూ భేదంలేనట్టే నటించి! తీరా కాంటీన్ ముందుకెళ్ళాక మొహం పైకెత్తి, కాంటీన్‌లో కూచుని వివిధరకాల ఫలహారాల్ని ఆరగిస్తూ - రకరకాల దుస్తులు వేసుకున్న వ్యక్తుల్ని చూచాడు. అప్పుడు జేబు తడుముకొని మధు ఏదో చేయరాని పని చేసినట్టు ఫీలయి గిరుక్కున వెనక్కి తిరిగేడు.

మధు సముద్రం ఒడ్డునే ఇసుకలోబడి-జనం ఎవరూ లేనిచోటికి వెళ్లి ఒక్కడే కూచున్నాడు. ఇంతలో ఎవరో తనవేపు వస్తున్నట్టు చూచి విస్తుపోయాడు. తీరా దగ్గర కొచ్చాక చూస్తే అతను 'వేరుకడలె'వాడు. వాడుదగ్గరకురాగానే మిగులుతుందనుకున్న అణాలో అర్ధణా పైకి తీసి "అరణా వేరుకడలె కుడప్పా" అని లాగు జేబులోనుంచి జేబు రుమాలు తీశాడు. జేబు రుమాలు! అది చేతిలోకి రాగానే ఎందుకో మధు ఒక్కసారిగా విచరితుడైనాడు. గతించిన రోజులు స్మృతి పథంలోకి వచ్చి ఏవేవో భావాల్ని సృష్టించాయి. ఒక చేతిలో అర్ధణా వుంది, మరో చేతిలో జేబు రుమాలు వుంది. ఈ రెంటిని పుచ్చుకొని మధు భావముద్రలో లీనమై వాస్తవిక జగత్తునే విస్మరించిన వాడిలా శూన్యం వేపుకు తదేకంగా చూస్తున్నాడు. వేరుకడలెవాడు "వీడు పిచ్చివాడు" అనుకొని పరుగు లంకించుకొని జనం వున్నచోటికి వెళ్ళాడు.

ఆ జేబు రుమాలు దూదికిమల్లే తెల్లగావుంది. దానిమీద చుట్టూ రంగు దారలతో అందమైన అల్లిక వుంది. మధ్యన ఆకుపచ్చ రంగుతో ఒక అందమైన లత. ఆ లత క్రిందనే "ప్రభ"అనే అక్షరాలు ఎంతో అందంగా ఆ తెల్లటి రుమాలు మీద శోభిస్తున్నాయి. ఈ ప్రభ ఎవరో? బహుశా మధు "లైలా" అయివుంటుంది. యౌవనంలో వున్న ప్రతి యువకుడూ ఒక మజునూగా, యుక్త వయస్సులో వున్న ప్రతి యువతీ ఎవరికో ఒకరికి లైలా"గా వుంటారు హావభావాల్లోనో, చూపుల్లోనో, మాటల్లోనో! ఒక్కొక్కప్పుడు ఒకరికి తెలియకుండా మరొకరు పరస్పరంగా లైలా మజ్నూల్లాగా వుంటారు. మధు "ప్రభ" కూడా అలాంటి లైలా అయివుంటుందేమో?

"ప్రభా!" అని దీర్ఘంగా ఉచ్ఛ్వసించి 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఆరాధిస్తున్నాను. నీ హృదయంలో నాకు చోటివ్వు!' ఓ రోజున ఇవే మాటలు నువ్వు నాతో అన్నావు. కాని 'ప్రభా నాకు కొంత అవకాశాన్ని ఇవ్వు! ప్రస్తుతం నా జీవితానికి విలు

తలు ఏర్పడలేదు. అలాంటిది సంభవించగానే, నీ దగ్గరకు రెక్కలు కట్టుకుని వస్తాను. అప్పుడు మనం వివాహ బంధనానికి కట్టుపడదాం. మన ప్రేమ ప్రతిఫలిస్తుంది' అని. ఇప్పుడు నిన్ను కోరుకుంటున్నాను" అన్నాడు. ఆరుమాలులో 'ప్రభ' అనే అక్షరాలున్నాయి. దాన్ని ఆమె బహూకరించి వుంటుంది. దాంట్లో ప్రభ హృదయం కూడా నిహితమై వుందని ఇలా తన హృదయాన్ని విప్పి చెబుతున్నాడేమో? ప్రేమించామని చెప్పుకునేవాళ్ళు తమ ఏకాంతాన్ని ఇలాంటి ప్రలాపాలతో నింపి వేస్తారేమో?

మధు సంవత్సరంక్రింద ప్రభను ప్రేమించిన మాట వాస్తవం! కొన్ని ఆకర్షణలకులోనై ప్రభ మధును వివాహ మాడతానని చెప్పిన మాటకూడా నిజం కూడా! ఉభయులూ ఒకే కాలేజీలో ఇంటర్ మీడియెట్ చదివారు. జీవితం అంటే ఉభయుల్లో ఎవరికీ తెలీని రోజులవి! ప్రభ "మధూ! నిన్ను ప్రేమిస్తున్నా"నని చెప్పినప్పుడు మధు కొంతఉపజ్ఞతను చూపెట్టాడనే చెప్పాలి! మధు తన స్వీకారాన్ని తెలిపి వున్నట్లయితే పెళ్లి జరిగి వుండేది.

సంవత్సరం గడిచాక ఈ రోజు ఉదయం సూట్ కేస్‌లో భద్రం చేసుకున్న జేబు రుమాలు బయటికితీసి జేబులో వుంచుకొని రకరకాల వూహల దోనెల్లో విహరిస్తున్నాడు.

రెణ్ణెల్లక్రితం మధుకు ఒక ఆఫీసులో ఉద్యోగం లభించింది. అదీ ఒక ఉద్యోగమేనా? అతను సంపాయించేది కూడా ఒక జీతమేనా? ఉదయం పదిన్నరకు ఆఫీసుకువెళ్ళి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక యంత్రంలా పని చేయాలి! పై ఆఫీసర్లకు వంగి వంగి సలాములు చేయాలి! కొస్త పొల్లుబోయినా అధికారుల చీవాట్లూ, ఇంకా జరిగితే జీతం విరగ్గోయటమూ నిత్యమూ జరిగేదే! సక్రమంగా అతని చేతికి జీతంవస్తే అరవయి తొమ్మిది రూపాయలూ, కొంతచిల్లరా! ఇదేనా ఇతని జీవితానికి విలువ! ఇలాంటి విలువలు ఏర్పడినందుకేనా "ప్రభా! నిన్ను ప్రేమిస్తున్నా, ఆరాధిస్తున్నా"అని చెప్పుకోటం! తను పడరాని పాట్లు పడుతూంటే అది వూహించుకోక తన విషాదమయ జీవితంలోకి మరోవ్యక్తిని తోడ్కొని రావాలని ఎందుకంత ఉబలాటం? ఇలా కోర్కెలుండటం వల్లనే బీచ్‌కివెళ్లే అందమైన భార్యాభర్తల్ని చూచి ఈర్ష్య పడ్డాడు. వాళ్ల జీవితాలతో పోటీపడదామనుకున్నాడు.

మధు వెనకటిలాగా భావముద్రలో మునిగి వున్నాడు. అతని మనోనేత్రాల ఎదుట ప్రభ రూపం కన్పిస్తోంది. "నా జీవితంలో నువ్వు అవసరం ప్రభా! నా హృదయం మాటిమాటికీ నిన్నే కోరుకుంటోంది! నీ కళ్ళపాపల్లో నన్ను నేను చూచుకొని నా జీవితాన్ని సరిదిద్దుకుంటాను. నన్ను నీకు అర్పితం చేసుకుంటాను. నా జీవితంలోకి నువ్వు రాకపోతే నేనేమై పోతాను?" అని జేబురుమాలుమీద ప్రభ అనే అక్షరాలవేపు చూచి చెబుతున్నాడు.

నేటి సామాజిక జీవితం వ్యత్యస్తంగా వుందనీ దీనిమూలంగా రోజుకు ఎంతోమంది తిండిలేక చస్తున్నారనీ అతనికి స్ఫురించక — తన ప్రియురాలికోసం బాధలుపడుతున్నాడు. కనీసం తను అనుభవిస్తున్న జీవితాన్నైనా ఓ మారు పర్యావలోకనం చేసుకునే స్థితిలో లేడు మధు. ఈరోజు తన స్నేహితుడు కనికరించి తన గదిలో చోటివ్వటంవల్ల సరిపోయింది. లేకపోతే తను ఎక్కడుండాలి? ఏమవ్వాలి? జేబులో చిల్లిగవ్వ లేదు. రేపటిమాటుకు రేపటికి మరెవరిదగ్గరైనా అప్పు తీసుకోకపోతే తన పని గడవదు. తన నిర్జీవ ప్రతిమకు తనకు తానే జీవంపోసుకొని లేనిపోని విలువల్ని కల్పించుకొని తారాపథాల్లో విహరిస్తున్నాడు. మొయిలు రాయబారాన్ని చదువుతున్నాడు. "నువ్వు శరీరమాత్రంగా నిలిచివున్నావు. నువ్వు ఎప్పుడో చచ్చిపోయావు. నీ జీవితానికి 'రేపు' అనేదిలేదు" అని అతని మనస్సు ఉద్బోధించనైనా లేదు.

ఇంతలో మధు పక్కగా ఇద్దరు ముగ్గురు వ్యక్తులు నడిచివెళ్తున్నారు. ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థులై వుంటారని మధు వాళ్ళ సంభాషణనుబట్టి తేలిగ్గా వూహించగలిగాడు. వాళ్ళు జాన్ మిల్టన్ 'పేరడైజ్ లాస్ట్'ను విమర్శించుకుంటున్నారు. షేక్స్పియర్ "ఒథెల్లో" విలన్ "లాగో"నుగూర్చి వాదించుకుంటున్నారు.

మధుకు ప్రభ గుర్తుకొచ్చింది. ఆమె ప్రస్తుతం కాలేజీలో బి. యే. చదువుతోంది. ఇటీవలే తన పాఠ్యగ్రంథాలైన పేరడైజ్ లాస్ట్‌ను గూర్చి "ఒథెల్లోను" గూర్చి రాసినట్టు గుర్తు! బహుశా ఆమెకూడా ఈలాంటి గొప్ప ఆంగ్లరచయితల్ని గూర్చి తన స్నేహితురాండ్రతో చర్చిస్తూ వుంటుంది! ఇలా అనుకున్న మరో నిమిషంలోనే తన సంగతి గుర్తుకొచ్చింది. "ఆమెకూ నాకూ ఎంత భేదం? ఆమె బి. యే. చదువుతోంది. అది పూర్తి చేసుకుంటుంది. పెళ్ళి చేసుకుంటుంది. ఎవరిని? తననా? ఛీ! ఏం ఆలోచన? నాకు పిచ్చి ఎక్కలేదు గదా? నా ఈ జీవితంలో ఏమి వుందని, నేనేమి సాధించానని, ఆమెను కోరుకోవాలి? ఈరోజు ఆమె చదువు ఆపివేసి ఇంటిదగ్గర కూచున్నా, తనతండ్రి సమంగా పంచి యిచ్చిన పొలంలోని ఆదాయం ఆమెకి ఎంతో ఎక్కువ! అలాంటి ప్రభ నన్ను విస్మరించక, ఎందుకూ కొరగాని నన్నే కోరుకుంటుందని అనుకోటానికి ఏమి ఆధారాలున్నాయి?" అని బాధపడి తలచేత్తో పుచ్చుకొని మళ్ళా ఏమిటో ఆలోచిస్తున్నాడు! మాటిమాటికీ "షా" వ్రాసిన "పిగ్మాలియన్" గుర్తుకొచ్చింది. దానిలోని "అంతా సమానం! ఒకరుఎక్కువా, మరొకరు తక్కువా లేదు..." అనే భావాలు తన చుట్టూ ముసురుకుంటున్నాయి. ఆ సమయంలో మధు నోటినుంచి వెలువడిన మాటలు ఇవి : "నా జీవితంలో అంధకారం అలుముకొనివుంది. ఎప్పటికీ వెలుగు కన్పించదు. నేనిలా బాధల్లో నరక యాతనలు అనుభవించాల్సిందే! సంఘాన్ని మరమ్మత్తు చేసే వాళ్ళకు నామీద కనికరం ఎందుకులేదు? నేనిలా ఆర్థికంగా బాధపడి నా సమస్త హృదయైక భావాల్ని చంపుకుంటున్నానని వారికి తెలిస్తే ఎంతో బావుండును... ప్రభా! నేను నిన్ను ప్రేమించలేను! నిన్ను వాంఛించలేను, నేను నీకు అన్ని రకాలుగా అనర్హుణ్ణి!"

సముద్రం హోరున ధ్వనిస్తోంది. ఇంతెత్తున ఎగిరి ఆఖరికి దానిలోనే లీనమవుతున్నాయి అలలు! ఈ ఘోషపెడుతూన్న సముద్రానికీ తనకీ సామ్యం వుందేమోనని ఆలోచించుకుంటున్నాడు.

పిచ్చి మధు మొహానికి చేతులు అడ్డం పెట్టుకున్నాడు. వేళ్ళ సందుల్నుంచి కంటి నీరు బొటబొట కారినాయి. ఆ కన్నీరు ప్రభ ప్రేమతో బహూకరించిన జేబు రుమాలును తడిపింది. కాని దీన్ని మధు చూడలేదు. అతని కనురెప్పల కొలకుల మధ్యన ఏదో అనంత వేదన కన్నీరుగా మారి బయటికి ప్రవహిస్తోంది. అలల్లాగ ఆఖరికి అతని కన్నీరు కరిగి విరిగి పోతున్నది.

చుట్టూ ప్రకృతి అంధకారాన్ని పూసుకుంది. అలలు లేచి పడుతున్నాయి. వేదనపడి పడి మధు లేచి నిల్చున్నాడు. సముద్రంలో దుమికి ప్రాణాల్ని పోగొట్టుకోడు గదా? ఈ ఆర్థిక అసమానత్వం ఎందరి ప్రాణాల్ని బలిగొంటుంది! ఎందరి ఆంతర్యాల్ని ధ్వంసం చేస్తోంది? దీనికి కారణం నేటి పాలకవర్గమే అయినా మధులాంటి మధ్య తరగతి యువకులకు దీన్ని వశపరుచుకునే సమర్థత లేనేలేదా? మధు సముద్రం వేపుకు నడవక నగరం వేపుకే నడిచాడు! నగరం విద్యుత్ దీపాలతో వెలుగొందుతోంది. అంతటా వెలుగు - వెన్నెల్లా వుంది బజార్లలో! కాని ఇలాంటిచోటే మధులాంటి ఎంతోమంది యువకుల హృదయాల్లో చీకటి-పెంజీకటి తాండవిస్తోంది. పైపైకినవ్వుతూ లోలోన రోజూకు వంద చావులు చచ్చి శరీర మాత్రంగా శేషించివున్నారు.

మధు టెర్మినస్ దగ్గరి కొచ్చాడు. కాని మొహంలో నవ్వు వుంది! ఏదో విజయాన్ని సాధించబోయే వీరుడిలా వెలుగొందుతోంది. అతని-ఇంతక్రితమే వేదనావిదళితమైన హృదయాంతర్భాగం, అతని ఆంతర్యం, ఏవో అవ్యక్తమైన వైతాళిక గీతాల్ని ఆలాపిస్తోంది, ఎవరినో మేల్కొలిపేందుకు.

బస్‌లో ఎక్కబోయేప్పుడు అతను జేబు తడుముకున్నాడు. సంవత్సరం క్రితం ప్రభ యెంతో ప్రేమపూర్వకంగా బహూకరించిన జేబురుమాలు జారిపోయింది. ఇందుకు మధు వేదనపడలేదు. నవ్వుకున్నాడు, అతనిలో వీటన్నిటికీ మించిన ఏదో ఒక గొప్ప భావం జాగరితమైనది.